www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
బుధవారం | 18 | జూన్ | 2025
పేజీలు : 6


## వైరా మద్యం డిపోలో హమాలీ పోస్టుల అమ్మకం



-రూ.30 నుంచి రూ.40 లక్షల వరకు డిమాండ్
-కష్టం ఒకరిది ఫలితం మరొకరిది
-కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తా : డిపో మేనేజర్ నారాయణరావు

2లో

# దత్త గుత్తేదారులు..!




-వీరికే ప్రభుత్వ పనులు
-పేరుకే టెండర్ ప్రక్రియ
-నాణ్యతపై ప్రశ్నించేందుకు జంకుతున్న అధికారులు

దత్తత గ్రామాలు, మండలాలు, దత్తత విభాగాలు ఉన్నట్లే ఇప్పుడు దత్త గుత్తేదారులు వచ్చారు. వీరిని ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రజాప్రతినిధులు దత్తత తీసుకున్నారు. తమ పరిధిలోని పనులు వారికి తప్ప మరొకరికి ఇవ్వటం లేదు. అమాత్యుల మొదలు ప్రజాప్రతినిధులతో నేరుగా గుత్తేదారులు సంబంధ బాంధవ్యాలు నడుపుతుండటంతో నాణ్యత కాలపరిమితి ఇతరత్రా అంశాలపై ప్రశ్నించేందుకు అధికారులు జంకుతున్నారు. అడిగితే మనం ఉంటామా అన్న భయం అధికారులను పట్టుకుంది. బిఆర్ఎస్ పాలన తొలి నాళ్లలోనే ప్రారంభమైన ఈ దత్త గుత్తేదారుల వ్యవస్థను కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు పెంచి పోషిస్తుండటం గమనార్హం.

2లో

-ప్రజాపక్షం/ఖమ్మం

## యండపల్లి గట్టు ఇక గతమే

-జాతీయ రహదారుల నిర్మాణంతో కనుమరుగు



ప్రజాపక్షం/ఖమ్మం : మధిర మండలంలో చారిత్రికంగా చెప్పుకునే అంశాలలో యండపల్లి గట్టు ఒకటి. వైరా, మధిర మధ్య ప్రయాణించే వారికి తూర్పు దిక్కుగా కనిపించే ఎత్తయిన కొండనే యండపల్లి గట్టు అంటారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దుల్లో ఉంటుంది. ఒకప్పుడు ఇక్కడ యండపల్లి అనే ఊరు ఉండేదని పూర్వీకుల నుంచి

మిగతా 2లో..

## తీర్పు తర్వాతే స్థానిక సమరం

-రిజర్వేషన్లు తేలిన తర్వాతే ఎన్నికలు
-బిసి రిజర్వేషన్‌పై తర్జన భర్జన




ప్రజాపక్షం/ఖమ్మం : స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఇప్పట్లో నోటిఫికేషన్ వెలువడే సూచనలు కనిపించడం లేదు. ఒకరిద్దరు మంత్రులు, కాంగ్రెస్ నాయకులు జూన్ మాసంలో చివరిలో నోటిఫికేషన్ విడుదలై జూలై మొదటి వారంలో ఎన్నికలు జరిగే అవకాశం ఉందని క్యాడర్‌ను సన్నద్ధం చేసేందుకు ప్రకటించిన ఆ అవకాశం లేదని స్పష్టమైంది. బిసి రిజర్వేషన్లు తేలకుండా స్థానిక సంస్థల ఎన్నికలకు వెళితే ప్రతికూల ఫలితాలు వచ్చే అవకాశం ఉందని కాంగ్రెస్ పార్టీ భావిస్తుంది. రాష్ట్రంలో జన గణన జరిగిన తర్వాత కాంగ్రెస్ పార్టీకి కొంత సానుకూల అంశంగా మారింది. దేశ వ్యాప్తంగా కూడా తెలంగాణలో జరిగిన జన గణనకు సంబంధించి చర్చ సాగుతున్న తరుణంలో జన గణనకు అనుగుణంగా రిజర్వేషన్లపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. రిజర్వేషన్లు తేలకుండా పాత పద్ధతి లోనే ఎన్నికలకు పోతే జన గణన చేసి సాధించి ఏమిటన్న ప్రశ్నను

మిగతా 2లో..

# దత్త గుత్తేదారులు..!

**ప్రజాపక్షం/ఖమ్మం :** ప్రజా ఉపయోగాలకు సంబంధించి ప్రభుత్వం టెండర్ ప్రక్రియను నిర్వహించి గుత్తేదారులకు అప్పగించటం ఇప్పటిది కాదు. టెండర్ నియమ నిబంధనలకు లోబడి టెండర్ ఖరారు చేస్తారు. అప్పటి టిఆర్ఎస్, ఇప్పటి బిఆర్ఎస్ 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత తమ కనుసన్నల్లో ఉండేవారికి టెండర్లు దక్కేలా చేస్తూ గుత్తేదారు కోటరీని తయారు చేసుకున్నారు. రాష్ట్రంలో ఎక్కడ ఏ పని ఎవరు చేయాలో హైదరాబాద్‌లోనే నిర్ణయం జరుగుతుండేది. గులాబీ నేతల కనుసన్నల్లో పని చేసే వారికి పనులు దక్కేవి. నేతల ఖర్చుల మొదలు ఇతరత్రా వ్యవహారం అంతా గుత్తేదార్లే చూసుకునే వారు. ఇదే సమయంలో నాణ్యత, పనుల పూర్తి అంచనాలు తదితర విషయాలపై అంతగా పట్టింపు ఉండేది కాదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 18 నెలల తర్వాత కూడా ఇదే పద్ధతిని ఆ పార్టీ ప్రతినిధులు కొనసాగిస్తున్నారు. తమకు ఇష్టమైన వారికి పనులు అప్పగిస్తున్నారు. మంత్రులు లేదా ప్రజాప్రతినిధులకు దగ్గరగా మసులుకుంటున్న వారే ఎక్కువగా పనులు చేస్తుండటంతో నాణ్యత కొరవడుతుందన్న భావన పెరుగుతుంది. ఏ పని ఎవరికి దక్కాలి అన్నది ఇప్పుడు కూడా హైదరాబాద్‌లోనే నిర్ణయం అవుతుందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. అప్పటి గులాబీ గుత్తేదార్లే ఇప్పుడు పనులు నిర్వహించటం ద్వారా మాకు కావాల్సింది సంపాదనే కానీ ఏ పార్టీ అయితే మాకేంటి అన్నట్లు వ్యవహరిస్తున్నారు. జిల్లాలో ఇటువంటి వ్యవహారంలో అరితేరిన గుత్తేదారు దశాబ్ద కాలంగా తన హవా కొనసాగిస్తుండగా అదే బాటలో ఇప్పుడు మరికొందరు పయనించి ఆయనతో పోటీ పడుతున్నట్లు సమాచారం. మండలానికి ఒకరు, ప్రాంతానికి ఒకరు అన్న రీతిలో గుత్తేదారు వ్యవస్థను ప్రజాప్రతినిధులే బలోపేతం చేస్తున్నారన్న ఆరోపణలకు కొదవ లేకుండా పోయింది. ఒకరిద్దరు మరో అడుగు ముందుకేసి మట్టి పని ఆయన, సిమెంట్ ఇయన, వంతెన మరొకరు అన్నట్లు పంచుతున్నారట. వేల కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేస్తున్న వీరిని నాణ్యతపై స్థానిక అధికార పార్టీ నాయకులు మొదలు అధికారుల వరకు ఎవరు ప్రశ్నించకూడదు. ఒకవేళ ప్రశ్నిస్తే ఎక్కడ నుంచి ఫోన్ రావాలో అక్కడి నుంచే వస్తుండటంతో ప్రస్తుతం గుత్తేదార్ల ఇష్టారాజ్యం నడుస్తుంది. గతం మాదిరి అన్ని చూసుకుంటున్నారో లేదో కానీ గుత్తేదారులు తమను ఎవరు ప్రశ్నించకుండా మాత్రం చూసుకుంటున్నారు. ఇందులో పని ప్రాధాన్యత, నాణ్యత, ప్రజా అవసరాలను దృష్టిలో పెట్టుకుని పని చేసే గుత్తేదారులు ఉన్నారు. పాత పద్ధతిలో టెండర్లు వేసి పోటీ పడి పనులు చేపట్టినా ఫలితం లేకపోవడంతో ఇటువంటి వారంతా అధికార పార్టీ నేతలను కాకా పట్టే పనిలో ఉన్నారు. మొత్తంగా దత్త గుత్తేదార్ల కారణంగా ప్రభుత్వానికి, వారిని ప్రోత్సహిస్తున్న వారికి అప్రతిష్టను తెచ్చిపెడుతున్నారు. దత్త గుత్తేదారులపై పునరాలోచిస్తే మంచిది. లేకపోతే గతంలో ప్రోత్సహించిన ఫలితమే పునరావృతం కాక తప్పక పోవచ్చు.

# తీర్పు తర్వాతే స్థానిక సమరం

(మొదటిపేజీ తరువాయి)

అధికార కాంగ్రెస్ ఇంటా బయట ఎదుర్కొవాల్సి ఉంటుంది. ఇప్పటికే బిసి జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు ఏర్పాటు చేయాలని బిసి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇందుకు అనుగుణంగా సదస్సులు, సమావేశాలు, సభలు కూడా నిర్వహించారు. ప్రభుత్వం సైతం ఇందుకు అనుగుణంగానే రిజర్వేషన్ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లింది. రిజర్వేషన్ వ్యవహారం న్యాయస్థానంలో ఉండగానే పాత రిజర్వేషన్ ప్రకారం ఎన్నికలు నిర్వహించడం సబబు కాదన్న వాదన వినపడుతుంది. గతంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు వచ్చినా రాకున్నా కాంగ్రెస్ పార్టీ మాత్రం బిసి జనాభాకు అనుగుణంగా స్థానాలు కేటాయిస్తుందని ప్రకటించారు. అప్పుడు బిసి సంఘాల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. పార్టీ పరమైన రిజర్వేషన్ కాదని చట్టపరమైన రిజర్వేషన్ జరగాలని డిమాండ్ చేశారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఎన్నికల నోటిఫికేషన్‌కు వెళితే ఇబ్బందికర పరిస్థితులు వస్తాయి. ఇదే సమయంలో రుణమాఫీ, రైతు భరోసా పైన కొంత గందరగోళం ఉంది. గత యాసంగి పంటకు సంబంధించి ఐదు ఎకరాలు పైబడిన రైతులకు రైతుభరోసా వారి ఖాతాల్లో జమ కాలేదు. తర్వాత ఆరోహణ క్రమంలో భూ విస్తీర్ణాన్ని బట్టి భరోసా జమ అవుతుందని భావించారు. కానీ యాసంగి భరోసా పడకుండానే ఇప్పుడు ఖరీఫ్ భరోసా జమ చేస్తుండడంతో ఐదు ఎకరాలు పైబడిన రైతుల్లో ప్రభుత్వం పట్ల అంత సానుకూలత లేదు. రెండు లక్షలు పైబడిన రుణమాఫీ జరగకపోవడం, రెండు లక్షల లోపు కూడా కొంత గందరగోళం ఉండడం ఇటీవల ఛార్జీలు పెంచడం కూడా ఇబ్బంది కరమే. మరికొన్ని సానుకూల అంశాలు ప్రభుత్వ పరంగా జరిగిన తర్వాత ఎన్నికలకు వెళ్లడం మంచిదన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతుంది. ఇప్పుడు సహకార సంఘాలు మినహా మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా ప్రజాపరిషత్‌లు ప్రత్యేకాధికారుల పాలనలోనే ఉన్నాయి. గ్రామ పంచాయతీలకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2018లో తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం 2018ని తీసుకు వచ్చింది. ఇతరత్రా నిబంధనలతో పాటు రిజర్వేషన్ ప్రక్రియ రెండు ఎన్నికలకు ఒకసారి మారే పద్ధతిలో చట్టాన్ని రూపొందించారు. ఆ చట్టం ప్రకారం ఎన్నికలు జరిపితే గ్రామ పంచాయతీల్లో పాత రిజర్వేషనే కొనసాగుతుంది. ఇప్పుడున్న రిజర్వేషన్ మారాలంటే పంచాయతీరాజ్ చట్టంలో మార్పులు చేయాల్సి ఉంటుంది. మార్పులు జరిగితే తిరిగి రిజర్వేషన్ ప్రక్రియలో జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ కల్పించాల్సి ఉంది. ఇంత ప్రక్రియ జరగాల్సిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తొందరపడి స్థానిక ఎన్నికలకు పోక పోవచ్చు. సోమవారం జరిగిన కార్యక్రమాల సందర్భంగా ఇష్టాగోష్టిలో కోర్టు తీర్పు తర్వాతే స్థానిక ఎన్నికలకు పోవాలన్న భావన వ్యక్తమైనట్లు తెలుస్తుంది. వీటన్నింటి దృష్ట్యా స్థానిక సమరానికి మరి కొంత కాలం వేచి చూడక తప్పదు.

# వైరా మద్యం డిపోలో హమాలీ పోస్టుల అమ్మకం





**ప్రజాపక్షం/వైరా:** వైరా మద్యం డిపోలో హమాలీల అమ్మకం జరుగుతుంది అనే ఆరోపణలు ఇప్పుడు పెద్ద ఎత్తున చక్కెరలు కొడుతుంది. వైరాలో ఉన్న మద్యం డిపో నుండి జిల్లా నలుమూలలకు బార్ అండ్ రెస్టారెంట్లకు వైన్ షాపులకు ఇక్కడ నుండే మద్యం సరఫరా జరుగుతూ ఉంది. ఈ మద్యం సరఫరాకు సంబంధించి సంబంధిత వైన్ షాపుల యజమానులు చలానాలు కట్టిన తర్వాత మద్యం డిపోలో వాహనాలు ద్వారా లిక్కర్ కేసులు బీర్ కేసులు తీసుకొని వెళ్తారు. వీటిని వాహనాల్లో ఎక్కించేందుకు ఇక్కడ పెద్ద ఎత్తున సుమారు 45 మంది హమాలీలు పనిచేస్తూ ఉన్నారు. అయితే ఇటీవల కాలంలో హమాలీల అమ్మకం జోరు గా కొనసాగుతుందనే వాదన వినిపిస్తుంఇ. ఒక హమాలీ పని చేసుకునేందుకు సుమారు రూ.30 నుంచి రూ.40లక్షలు మార్కెట్ ధర పలుకుతుందని తెలుస్తుంది. ఇటీవల వైరాకి చెందిన ఓ వ్యక్తి రూ.30లక్షల హమాలీని పనిచేసుకునేందుకు విక్రయించినట్లు ఇప్పుడు వైరాలో చక్కెర్లు కొడుతున్న విషయం హమాలీ పని చేసుకోవడానికి అక్కడ ఉన్న హమాలీలే సరిపోతుంటారు. కాని ఇలా కొంతమంది వారి కష్టాన్ని నగదుగా మార్చుకునేందుకు లక్షల రూపాయలకు విక్రయాలు కొనసాగుతున్నాయి. 2018 నుండి కొంతమంది కొత్తగా అక్కడ వచ్చే కష్టాన్ని పని చేసే అతనికి సగం బయట ఉన్న అతనికి సగం విధంగా దోచుకుంటున్నారో ఒకసారి చూడాలి. 2018 వరకు ఖమ్మం ప్రాంతంలో ఉన్న వ్యక్తులు హమాలీగా చేరారు. ఇప్పుడు వారి స్థానంలో మరొకరిని పెట్టి వారితో పని చేపిస్తూ వారి వద్ద నుంచి వచ్చిన డబ్బుల్లో సగం దోచుకుంటున్నారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపితే వాస్తవాలు బయటకు వస్తాయి. కొంతమంది అక్కడ పనిచేస్తున్న హమాలీలు పోస్ట్‌ను మరొకరికి విక్రయించారు. ఇలా అమ్మకానికి హమాలీ అనే వాదన ఇప్పుడు బలంగా వినిపిస్తుంది.

**హమాలీ పోస్టులు అమ్మకం జరిగితే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తా...**

హమాలీలు పోస్ట్ అమ్మకం జరుగుతున్న విషయం నా దృష్టికి రాలేదు. విషయం తెలుసుకొని ఎవరైనా అమ్మకాలు చేసి ఉంటే వారి వివరాలను కలెక్టర్‌కి ఫిర్యాదు చేస్తామని మద్యం డిపో మేనేజర్ నారాయణరావు తెలిపారు.

# యండపల్లి గట్టు ఇక గతమే

(మొదటిపేజీ తరువాయి)

ఓ కథనం ప్రచారంలో ఉంది. అందుకు అనుగుణంగా మధిర మండలంలో యండపల్లి రెవెన్యూ గ్రామం ఇప్పటికీ ఉంది. అక్కడ గ్రామానికి సంబంధించిన కనీస అనవాళ్లు లేకున్నా రెవెన్యూ రికార్డులో మాత్రం యండపల్లి గ్రామ రెవెన్యూ పేరిట సుమారు 1500 ఎకరాల భూములు ఉన్నాయి. దాదాపు ఐదారు కిలో మీటర్ల చుట్టు కొలత కలిగిన ఈ గుట్ట రాళ్ల మధ్య ఒక చిన్ని నీటిగుంట ఉండేదని రోహిణి కార్తె మొదలు ఏ సమయంలోనైనా నీరు ఒకే మట్టంలో నిల్వ ఉండేదని ఈ గుంటలోని నీటిని అప్పట్లో చర్మవ్యాధులు తగ్గించేందుకు వినియోగించే వారని స్థానికులు చెబుతుండే వారు. చారిత్రిక ప్రశాస్థం కలిగి చుట్టూ 30 గ్రామాలకు ఎత్తయిన గుట్టగా కనిపించే యండపల్లి జాతీయ రహదారుల నిర్మాణంతో కనుమరుగు కానుంది. రహదారుల నిర్మాణానికి అవసరమైన మట్టి కొరకు ప్రభుత్వం ఈ గుట్ట మట్టిని కేటాయించారు. నాగపూర్ అమరావతి జాతీయ రహదారి రెండవ జోన్ నిర్మాణానికి మట్టిని కేటాయించినట్లు తెలుస్తుంది. ఈ జాతీయ రహదారి కూడా యండపల్లి గట్టు సమీపం నుంచే వెళ్తుండడం గమనార్హం. ఇప్పటికే 20 శాతం గుట్టను తవ్వి తరలించారు. ఏడాది రెండేళ్లలో గుట్ట కనుమరుగు కానుంది. గుట్ట తరలించుకు పోయిన తర్వాత ఈ ప్రాంతాన్ని అభివృద్ధి పరిచేందుకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మధిర శాసన సభ్యులు మల్లు భట్టివిక్రమార్క పారిశ్రామిక ప్రాంతంగా తీర్చిదిద్దాలని భావించరు. అందుకు అనుగుణంగా రూ. 84 కోట్లతో ఇండస్ట్రీయల్ పార్కును ఏర్పాటు చేసేందుకు శంకుస్థాపన చేశారు. పనులు కూడా ప్రారంభమయ్యాయి. ఇండస్ట్రీయల్ పార్కుకు ప్రధాన రహదారుల నుండి లింక్ రోడ్లను కూడా పూర్తి చేశారు. ఇండస్ట్రీయల్ పార్కు అభివృద్ధి చెందితే రెండు రాష్ట్రాల సరిహద్దుల్లో ఒక పారిశ్రామిక ప్రాంతం ఒక నవీన గ్రామం రూపు దిద్దుకుంటుంది. అప్పుడు యండపల్లి గట్టు కనుమరుగైన ఒక పారిశ్రామిక ప్రాంతాన్ని త్వరలోనే చూసే అవకాశం ఉంది.

# అంగన్వాడీలకు కార్పోరేట్ స్థాయి వసతులు

## -చిన్నారులకు పుస్తకాలు బ్యాంగులు పంపిణీ చేసిన కలెక్టర్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** అంగన్వాడీలకు కార్పోరేట్ స్థాయి వసతలు కల్పించి అభివృద్ధి చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. అమ్మమాటఅంగన్వాడీ బాట కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ పాతపాల్వంచ మండల ప్రాథమిక పాఠశాల ఆవరణలోని అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు మంగళవారం బ్యాగులు, పలకకలు, పుస్తకాలు, బ్యాంగులు, బూట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని అంగన్వాడీల్లో విద్యుదీకరణ, తాగునీరు,మరుగుదొడ్లు వంటి మౌళిక సదుపాయాలు కల్పించి పిల్లలకు మంచి వాతావరణాన్ని అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. చిన్నారుల మానసిక, భౌతిక అభివృద్ధికి తగిన తరగుతులు నిర్వహిస్తామన్నారు. తల్లిదండ్రులు పిల్లలను ఖరీదైన బడుల్లో చేర్పించి ఆర్థికంగా చితికిపోకుండా అధునాతన అంగన్వాడీల్లో చేర్పించి చదివించాలన్నారు. ప్రభుత్వ బడుల్లోనే పిల్లలకు బలమైన పునాదులు పడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాస్, మహిళా శిశు వయోవృద్ధులు, దివ్యాంగుల అధికారి స్వర్ణలత లెనినా, ఐసిడిఎస్ సిడిపిఓ, సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు, పిల్లలు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్ధులకు నోట్ పుస్తకాలు పంపిణీ




**ప్రజాపక్షం/ బోనకల్ :** బోనకల్ మండలంలోని 33 ప్రాథమిక పాఠశాలల్లోని 790మంది విద్యార్ధులకు నోట్ పుస్తకాలను అందించటం జరిగిందని ఎంఇఓ తెలిపారు. మంగళవారం జరిగిన పంపిణీ కార్యక్రమానుద్దేశించి ఆయన మాట్లాడుతూ మొదటిసారిగా ప్రైమరీ స్కూల్స్‌కి ప్రభుత్వం ఉచితంగా నోట్ బుక్స్‌ను పంపిణీ చేసిందని, ఉపాధ్యాయులు ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలను విద్యార్ధుల తల్లిదండ్రులకు వివరించి ప్రభుత్వ బడుల్లో విద్యార్ధుల సంఖ్య పెంచే విధంగా కృషి చేయాలని సూచించారు.

# సిపిఐ సీనియర్ నాయకులు సుబ్బయ్య మృతి



**ప్రజాపక్షం/ బోనకల్ :** మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు గుడిదే సుబ్బయ్య(85) మంగళవారం మృతి చెందారు. ఆయన మృతి వార్త తెలుసుకున్న సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆనందరావు మాట్లాడుతూ సుబ్బయ్య తుది శ్వాస వరకు కమ్యూనిస్టు సిద్ధాంతాలను నమ్మి సిపిఐలో కొనసాగుతూ అనేక ఉద్యమాల్లో పాల్గొని ఆయన చేసిన సేవలు కొనియాడారు. సుబ్బయ్య మృతి సిపిఐకి తీరని లోటన్నారు. సుబ్బయ్య కుమారుడు ప్రస్తుతం సిపిఐ గ్రామ కార్యదర్శిగా ఉన్నారు. సుబ్బబయ్యకు ఆరుగురు కుమారులు ఉన్నారు.

# రేణుకాచౌదరికి ఘన సన్మానం

**ప్రజాపక్షం/వైరా:** కేంద్ర మాజీ మంత్రివర్యులు ప్రస్తుత రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరిని వారి నివాసం నందు టిపిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు నాయకత్వంలో వైరా నుండి భారీ ఎత్తున కాంగ్రెస్ పార్టీ శ్రేణులు వెళ్లి శాలువా కప్పి గజమాలతో ఘనంగా సన్మానించడం జరిగింది. ఇటీవల పార్టీ ప్రకటించిన రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శిలో వైరా నుండి కట్ల రంగారావుకి అవకాశం రేణుకాచౌదరి కల్పించినందుకు కృతజ్ఞతతో పార్టీ శ్రేణులు వారిని ఘనంగా సన్మానించడం జరిగింది. రేణుకాచౌదరిని సన్మానించిన వారిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కాంపాటి శేషగిరి, కట్ల నాగరాజు, రేచర్ల రాముడు, కట్ల సంతోష్ సయ్యద్ అన్వర్‌పాషా, గుత్తికొండ వీరబాబు, రేచర్ల పుల్లయ్య, పాణెం భాస్కర్, గుడిమల్ల రత్తయ్య, యామాల భాస్కర్, షేక్ రసూల్, నల్లమల ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పింఛన్‌దారులకు ఆశనిపాతంలా కేంద్ర చట్టం

-పెన్షనర్స్ సంఘం జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య






**ప్రజాపక్షం/ఖమ్మం :** కేంద్ర ప్రభుత్వం రూపొందించిన చట్టం పింఛన్‌దారులకు ఆశనిపాతంలా మారనుందని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మార్చి మాసంలో పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదింపజేసిన ఈ చట్టంతో దేశ వ్యాప్తంగా పింఛన్‌దారులు పలు సమస్యలను ఎదుర్కొననున్నారని ఇందుకు వ్యతిరేకంగా బహుముఖ పోరాటాలకు, ఆందోళనలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం ఖమ్మం కృషి భవన్‌లో జరిగిన సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో పుల్లయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని ఇప్పటికే ఆలిండియా స్టేట్ పెన్షనర్స్ ఫెడరేషన్ డిమాండ్ చేసిందని సంతక సేకరణ చేపట్టాలని పిలుపునిచ్చిందని ఆయన తెలిపారు. ఆ పిలుపుకు అనుగుణంగా పింఛన్‌దారులు ఐక్యంగా కదిలి చట్ట రద్దు కోసం జరిగే పోరాటంలో పాలు పంచుకోవాలని పుల్లయ్య విజ్ఞప్తి చేశారు. పెన్షనర్లకు డిఆర్‌ను నగదు పూర్వకంగా చెల్లించాలని, పదవి విరమణ తర్వాత బకాయిలను సత్వరమే చెల్లించాలని పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. పింఛన్ దారులకు వైద్య సౌకర్యం ఉందని చెబుతున్న అది అమలులో సాధ్యం కావడం లేదని అన్ని కార్పోరేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్యం అందించేందుకు చర్యలు తీసుకోవాలని పుల్లయ్య కోరారు. ఖమ్మం నగరంలో ఏర్పాటు చేసిన వెల్‌నెస్ సెంటర్ వైద్య సేవలు అందించడంలో వైఫల్యం చెందిందని మౌలిక సదుపాయాలు కానీ సరిపడ మందులు కానీ వెల్‌నెస్ సెంటర్‌లో లేకపోవడం బాధాకరమన్నారు. సమృద్ధిగా మందులను సమకూర్చడంతో పాటు విస్తృత సేవలు అందించే ప్రాతిపదికన వెల్‌నెస్ సెంటర్‌కు నూతన భవనాన్ని నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. పెన్షనర్ల సమస్యలపై విడతల వారీగా ఆందోళనకు సిద్ధం కావాలని సంఘం పక్షాన పిలుపునిస్తున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్ మాట్లాడుతూ ఐక్య ఉద్యమాలు మాత్రమే సమస్యల పరిష్కారానికి దోహదపడతాయన్నారు. ఎవరో చేస్తారు సమస్య పరిష్కారం అనుకున్న దాని కంటే అందరూ ఐక్యంగా కదిలితే పరిష్కారం శీఘ్రగతిన లభిస్తుందన్నారు. ఈ సమావేశం ఇటీవల మృతి చెందిన ప్రముఖులకు నివాళులర్పించింది. సమావేశంలో ఆర్థిక కార్యదర్శి కనపర్తి వెంకటేశ్వర్లు, సహాధ్యక్షులు భాస్కరాచారి, మేరీ ఏసుపాదం, లక్ష్మి సుజాత, కృష్ణకుమారి, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, వీరభద్రరావు, ప్రసాదరావు, శ్రీనివాసరావు, ప్రకాష్, రామనాథం, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# డ్రైడే కార్యక్రమాలను నిర్వహించాలి

-యుపిహెచ్‌సిని సందర్శించిన డిఎంఅండ్‌హెచ్‌వో



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రతి మంగళ, శుక్రవారం డ్రైడే కార్యక్రమాలను నిర్వహించి ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి. కళావతి బాయి తెలిపారు. మంగళవారం ఖమ్మం నగరంలోని మామిళ్లగూడెం యుపిహెచ్‌సిని డిఎంఅండ్ హెచ్‌వో డాక్టర్ కళావతి బాయి సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. యుపిహెచ్‌సికి వచ్చిన రోగులతో మాట్లాడారు. అందుబాటులో ఉన్న వైద్య సేవలపై సమీక్షించారు. ఫార్మసీ ఆఫీసర్, నర్సింగ్ సిబ్బంది డ్యూటీ ఛార్జ్, ల్యాబ్ టెక్నీషన్ సేవలను పరిశీలించారు. వివిధ ఆరోగ్య కార్యక్రమాల అమలును పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారుల్లో డయేరియా నివారణకు జూన్ 16 నుంచి ప్రారంభమైన స్టాప్ డయేరియా కార్యక్రమానికి ప్రజలు సహకరించాలన్నారు. జూన్ నుండి నవంబర్ వరకు మలేరియా, డెంగ్యూ, ఫైలేరియా, చికెన్ గున్యా వంటి దోమల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి మంగళ, శుక్రవారం డ్రైడే కార్యక్రమాలను నిర్వహించి ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నారు. జ్వరం, వాంతులు, విరోచనలు వంటి సమస్యలు వస్తే తక్షణమే వైద్య సేవలను పొందాలని తెలిపారు. ఆశాలు, ఏఎన్ఎంలు అందుబాటులో ఉండాలని, పారా మెడికల్ సిబ్బంది విధులను పర్యవేక్షించాలని వైద్యులకు సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉంటే సర్వీస్ రూల్స్ ప్రకారం సిబ్బంది పై తగు చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి కృష్ణచైతన్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్లకు ఖాకీ చొక్కాలు పంపిణీ



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి సహకారంతో ఆటో డ్రైవర్లకు ఖాకీ చొక్కాలు పంపిణీ చేశారు. మంగళవారం ఖమ్మం నగరంలోని గట్టయ్య సెంటర్‌లో గల ఎంపి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి మద్దినేని స్వర్ణకుమారి, కాంగ్రెస్ నాయకులు కొప్పుల చంద్రశేఖర్ ఆటో డ్రైవర్లకు ఖాకీ చొక్కాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మద్దినేని స్వర్ణకుమారి మాట్లాడుతూ ప్రయాణికులను సురక్షితంగా వారి వారి గమ్య స్థానాలకు చేర్చుతున్న ఆటో డ్రైవర్లకు యూనిఫాం (ఖాకీ చొక్కాలు) లను ఎంపి సమకూర్చడం సంతోషకరమన్నారు. ఆటో డ్రైవర్లు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆటో కార్మికులకు ఎంపి క్యాంపు కార్యాలయం నుంచి పూర్తి సహకారం అందిస్తామని కొప్పుల చంద్రశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టియుసి ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ విప్లవ్‌కుమార్, కార్పొరేటర్ దొడ్డా నగేష్, టెలిఫోన్ అడ్వయిజరీ కమిటీ సభ్యులు ఉమ్మినేని కృష్ణయ్య, నాయకులు శ్రీను, జంగిపల్లి ప్రసాద్, సిద్దల నగేష్, తోట సైదులు, కె. మధు, ఎ. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు పంపిణీ



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండల పరిధిలోని సఖినవీడు గ్రామానికి చెందిన అల్లు దేవదాస్‌కి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన చెక్కును మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చేతుల మీదుగా మంగళవారం పంపిణీ చేయటం జరిగింది. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారి కుమారుడైన అల్లు వంశీకి అందచేశారు. ఈకార్యక్రమంలో సఖినవీడు గ్రామశాఖ అధ్యక్షులు పసుపులేటి వెంకటనారాయణ, శీలం శ్రీనివాస్‌రెడ్డి, రాజీవ్‌గాంధీ, అనుమోలు వెంకటకృష్ణారావు, మల్లెల లక్ష్మణరావు, నాగిరెడ్డి దేవరకొండ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సిఎం భట్టి పర్యటనను విజయవంతం చేయండి



**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలో భాగంగా బుధవారం డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క, రాష్ట్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించనున్నారని కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, మిరియాల రమణ గుప్త తెలిపారు. మధిర పట్టణ అభివృద్ధిలో భాగంగా సుమారు రూ.8.20కోట్లతో నిర్మించనున్న నూతన ఆర్టిసి బస్టాండ్ పనులకు శంకుస్థాపన, నూతన బస్సుల ప్రారంభోత్సవం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టిసి డిపో రాష్ట్ర, జిల్లా అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొంటారని, ఈ పర్యటనలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు,అభిమానులు అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



**ప్రజాపక్షం/ మధిర రూరల్ :** మండల పరిధిలోని దెందుకూరు హైస్కూల్‌లో చదువుతున్న సుమారు 70మంది విద్యార్థులకు దాతల సహకారం రూ.15వేలతో రాత పుస్తకాలను జిల్లా కోర్డినేటర్ చుంచు రామకృష్ణ చేతుల మీదుగా మంగళవారం పంపిణీ చేయటం జరిగింది. ఈ సందర్భంగా ఎంఇఓ వై.ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు సేవాభావంతో నోట్ పుస్తకాలను అందించిన దాతలను అభినందించారు. విద్యార్థులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసకుని బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దాతలు పొలిమేర జీవన్‌లైన్మెన్, యుద్ధపూడి జ్యోతి, హైస్కూల్ హెచ్ఎం వెంకటేశ్వరరావు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ పగిడిపల్లి శాంతమ్మ, పాఠశాల హెచ్ఎం డి.శ్యామలరావు, గ్రామ కార్యదర్శి బండి నాగేంద్రబాబు, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్‌తో గిరిజనుల జీవన స్థితిగతులు మెరుగు



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** గిరిజన తండాల్లో గిరిజనుల జీవన స్థితిగతులను మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం ధర్తి అబజన జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ పథకం ప్రారంభించిన సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు వివరాలు నమోదు చేశామని ఎంపిడిఓ ఎస్కే సిలార్‌సాహెబ్ తెలిపారు. గిరిజనుల్లో ఉన్న మొత్తం 700 తెగలు ఉప కులాలు ప్రకారం వారి జీవన స్థితిగతులు సాధికారితపై కేంద్ర ప్రభుత్వం ఖమ్మం జిల్లాలోని ఆరు మండలాలను ఎంపిక చేయగా తిరుమలాయపాలెం మండలంలోని సుద్దవాగు తండా, సోలిపురం, లక్ష్మీదేవిపల్లి, హైదరసాయిపేట గ్రామాలను గిరిజన గ్రామలుగా ఎంపిక చేయగా సుద్దవాగుతండా నందు ఇంటింటి సర్వే ప్రారంభించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ సర్వేలో గిరిజన తండాల్లో నివసిస్తున్న ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు ఏ విధంగా అందుతున్నాయి, వారి స్థితిగతులపై పూర్తిగా వివరాలను నమోదు చేశామని తెలిపారు. అందరికి ఆధార్ కార్డులు, ఆయుష్మాన్భవ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు అందాయా లేదా, అందరికి విద్యుత్ సౌకర్యం ఉందా లేదా, అందరికి కిసాన్ క్రెడిట్ కార్డులు ఉన్నాయా లేవా వంటి తదితర అంశాలను సర్వేలో పొందుపరిచామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ఖలీల్, ఐసిడిఎస్ సూపర్వైజర్ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి సంతోష్, ఎఎన్ఎంలు, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఎం సత్తా చాటాలి



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై కసరత్తు ప్రారంభించిందని, త్వరలో జరుగనున్న ఎన్నికల్లో సిపిఎం పార్టీ సత్తా చాటాలని సిపిఎం పార్టీ మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు పిలుపునిచ్చారు. మంగళవారం ఎర్రుపాలెంలోని రామిశెట్టి పుల్లయ్య భవనంలో నల్లమోతు హన్మంతరావు అధ్యక్షతన మండల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం శాసనసభ ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను అమల చేయటంలో పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రైతు భరోసా డబ్బులను రైతుల అకౌంట్‌లో జమ చేస్తుందని తెలిపారు. బిజెపి ప్రభుత్వం కార్మిక కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందన్నారు. కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా చేసే విధంగా కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా పనిచేస్తుందన్నారు. జూలై 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు దివ్వెల వీరయ్య, మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్‌రావు, మండల కమిటీ సభ్యులు సగ్గుర్తి సంజీవరావు, ఆంగోతు వెంకటేశ్వర్లు, షేక్.లాల్, దూదిగం బసయ్య తదితరులు పాల్గొన్నారు.

## ద్వాల్యాకు ఎఫ్‌డివోగా పదోన్నతి



ప్రజాపక్షం/జూలూరుపాడు: మండల పరిధిలోని అన్నార ప్పాడు గ్రామానికి చెందిన గుగులోతు ద్వాల్యా ప్రస్తుతం చర్ల ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌గా విధులను నిర్వహిస్తున్నారు. ఆయన పదోన్నతిపై ములుగు జిల్లా వెంకటాపురం ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్‌గా పదోన్నతి పొందారు. పదోన్నతి పొందటం పట్ల ఆయన మిత్రులు, సన్నిహితులు, ఈ ప్రాంత ప్రజలు శుభాకాం క్షలు తెలిపారు.

## గ్రామ పంచాయితీ కార్మికులకు తక్షణమే జీతాలు ఇవ్వాలి



ప్రజాపక్షం/జూలూరుపాడు: రెండు మూడు నెలలుగా పెం డింగ్‌లో ఉన్న గ్రామ పంచాయితీ కార్మికుల జీతాలను తక్షణమే అందజేయాలని తెలంగాణ ప్రగతి శీల గ్రామ పంచాయితీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏదులాపురం గోపాలరావు డిమాండ్ చేశారు. జూలూరుపాడులో మంగళవారం గ్రామ పంచాయితీ కార్మికులతో కలిసి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీఓకి వినతి పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పని చేస్తున్న గ్రామ పంచాయితీ కార్మికులకు గత రెండు నెలలుగా జీతాలను ఇవ్వకపోవడంతో తీవ్ర మైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అర్థాకలితో అలమటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో గ్రామ పంచాయితీ వర్కర్స్ యూనియన్ మండల అధ్య క్షులు నాగు, ప్రధాన కార్యదర్శి ధనవంతులరావు, గౌరవాధ్యక్షులు తంబర్ల లక్ష్మీ ఈరు, ఉపాధ్యక్షులు శిరంశెట్టి వినోద్, సహాయ కార్యదర్శి ఈరియా, కోశాధికారి విజయ, రజిని, మురళి, రాంబాబు, సుజాత, సేవ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత విద్యను అందించడమే మా లక్ష్యం



ప్రజాపక్షం/జూలూరుపాడు: జూలూరుపాడు మండలంలో ప్రభుత్వ పాఠశాలలో ఉన్నత విద్యను విద్యార్థులకు అందించాలని లక్ష్యంతో అధికార బాధ్యతలు చేపట్టిన నాటి నుండి మండల విద్యా శాఖ అధికారి ఝుంకీలాల్ ప్రత్యేక ప్రణాళికలను ఏర్పాటు చేసి మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రాథ మిక, ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు అంద జేశారు. జూలూరుపాడు మండలంను జిల్లాలో ఉన్నత విద్యా ఫలితాలలో ప్రథమ స్థానంలో ఉంచేం దుకు ప్రత్యేక దృష్టి సారించారు. అదే విధంగా 20242025 పదవ తరగతి ఫలితాలలో 97శాతం ఫలితాలు సాధించి జూలూరుపాడు మండలంను ప్రత్యేక స్థానంలో ఉంచారు. పదవ తరగతి చదివే విద్యార్థులకు ప్రారంభం నుంచే ప్రత్యేక ప్రణాళికను ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చూపిం చేందుకు ప్రొఫెసర్ జయ శంకర్ బడి బాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలపై మంచి అవగాహన కల్పించడంలో, విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేరడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొంటున్నారు. అదే విధంగా మండలంలో ప్రతి ప్రభుత్వ పాఠశాలలో కావలసిన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడంలో దృష్టి సాధిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ పాఠశా లల అభివృద్ధికై తన దైన శైలిలో సేవలను అందిస్తున్నారు. ఉపాధ్యాయుల, విద్యార్థుల మన్నలను పొందుతున్నారు.

## భూ సమస్యల పరిష్కారానికై గ్రామ సభల నిర్వహణ



ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకు వచ్చిన భూ భారతి అమలులో భాగంగా భూమసమస్యల పరిష్కారం కోసం రైతు సద స్సులు నిర్వహిస్తున్నట్లు తహాశీల్దార్ మన్నె ఉషాశారత తెలిపారు. మండల పరిధిలోని పెద్దగోపవరం, కంద్రిక, బంజర గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వ హించి రైతుల నుండి దరఖాస్తులు స్వీకరిం చారు. ఈ సందర్భంగా తహాశీల్దార్ మాట్లాడుతూ మండలంలో రైతులకు ఉన్న అన్ని సమ స్యలు భూ భారతి చట్టంతో పరిష్కరించేందుకు రైతు సదస్సుల ద్వారా ఆయా గ్రామాల్లో ఉన్న భూ సమస్యలను రైతుల ద్వారా తెలుసుకుని దరఖాస్తులు స్వీకరించి సమస్యలు పరి ష్కరించే విధంగా కృషి చేస్తామని తెలిపారు. పెద్దగోపవరం రైతు సదస్సులో 120దరఖా స్తులు, కంద్రి, బంజర గ్రామాల్లో 67 దరఖాస్తులు అందినట్లు రెవెన్యూ అధికారులు తెలి పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు ఎస్ రవికుమార్, బి.రాజశేఖర్, ఎఎస్ఓ జాన్‌దర్గాసా హెబ్, యుడిసి శిరీష, నరేష్, చందు, వరలక్ష్మీ, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌కు మోక్షమెన్నడో..?

**-అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా భవనం**
**-సొంత ప్రయోజనాలకు వాడుకుంటున్న బడాబాబులు**





ప్రజాపక్షం/మణుగూరు: పట్టణ పరిధిలో వ్యాపారుల సౌలభ్యం కోసం రూ. 4.70 కోట్లతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కు మోక్షం ఎప్పుడు కలుగుతుందా అని చిరు వ్యాపారులు ఎదురుచూస్తున్నారు. వ్యాపార సముదాయాలని ఏక ప్రాంతంలో తేవాలని అభీష్టంతో 2021లో స్థానిక రాజీవ్ గాంధీ నగర్ ఏరియాలో కోట్ల రూపాయలతో ప్రారంభించిన మార్కెట్ భవనం నేటి వరకు అసంపూర్తిగా నిర్మాణం కావడంతో అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారిందని స్థానిక ప్రజల ఆరోపిస్తున్నారు. గత నాలుగు సంవత్సరాలుగా ఈ భవనం పూర్తయితే వ్యాపారాలు చక్కడా చేసుకోవచ్చని ఎదురుచూస్తున్న వ్యాపారులకు ఈ సంవత్సర వర్షాకాలం కూడా నిరాశే మిగిల్చింది. పట్టణ పరిధిలోని ప్రధాన రహదారిపై నిత్యం బొగ్గు, ఇసుక లారీలతో నిండి ఉండటం ఇక్కడ వ్యాపారులకు శాపంగా మారింది. పట్టణ ప్రాంతంలో వ్యాపారాలు లేక అనేకమంది వ్యాపారస్తులు అప్పుల పాలై, ఐపీలు పెట్టి కుటుంబ పోషణ కోసం వేరే ప్రాంతాలకు వలస పోతున్న దుస్థితి మన మణుగూరు ప్రాంతంలో ఉంది. ఈ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం పూర్తయితే వీధుల్లో వ్యాపారాలు చేస్తున్నా అనేక మంది వ్యాపారులకు ఆసరా లభిస్తుందని వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. ఈ భవన నిర్మాణం నత్తనడకన నడవడంతో ఈ భవన సముదాయాలు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారాయని, రాత్రి వేళల్లో మందు బాబులకు అడ్డాలుగా మారాయని, అదేవిధంగా గంజాయి బ్యాచ్‌కు కూడా అనువుగా ఈ ప్రాంతం ఉండటంతో రాత్రి వేళలో అనేకమంది ఈ ప్రాంతంలో అసాంఘీక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోప ణలు వెలుగు చూస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే ఈ ఇంటిగ్రేట్ మార్కెట్ నిర్మాణాన్ని పూర్తి చేసి మణుగూరు వ్యాపారులకు అండగా నిలవాలని అదే విధంగా ఈ ప్రాంతంలో జరు గుతున్న అసాంఘిక కార్యక్రమాలను నిర్మూలించాలని ప్రభుత్వ అధికా రులను ప్రజలు కోరుతున్నారు.

# కల్లూరులో ప్రైవేట్ పాఠశాలల్లో దోపిడీ..!




ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు మండల పరిధిలోని పలు ప్రైవేట్ పాఠ శాలల్లో పుస్తకాలు, బెల్టు, టై ,బ్యాగులు, అడ్మిషన్ ఫీజులు, పాఠశాల ఫీజులు, విక్రయాల పేరుతో దోపిడికి పాల్పడుతున్నా మండల విద్యా శాఖ పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ధనార్జన ధ్యేయంగా యాజమాన్యాలు తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు పాఠ్య పుస్తకాల తదితర విక్రయాలతో తల్లిదండ్రుల జేబులకు చిల్లులు పొడు స్తున్నారు. పాఠశాలల్లో ఈ సంవత్సరం అత్యధికంగా మార్కులు ఎక్కువ మంది పాస్ అయ్యారంటూ ప్రచారం చేస్తూ ఫ్లెక్సీలు, కరపత్రాలతో ప్రచారంతో ఆకర్షించి ఫీజులతో భారం మోస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ఒకటి నుంచి 10 వరకు సుమా రుగా 7,000 మంది విద్యను అభ్యసిస్తున్నట్లు సమాచారం. తల్లిదం డ్రుల కమిటీలు లేకుండానే ఇష్టం వచ్చినట్లు ఫీజులు పెంచడం, వసూలు చేయడం లాంటివి చేస్తున్నారని ఆరోపణ వీటిపై నిఘా లేకుం డానే వసూలు చేస్తున్నట్లు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. విద్యాశాఖ నిద్రలో ఉన్నట్లు తెలియపరుస్తున్నారు. పర్యవేక్షణ లోపం పాఠశాలల్లో ఫీజులపై సూచిక బోర్డులు లేకుండా ఎవరికి వారే ఎవరికీ ఇష్టం వచ్చి నట్లు వారు వసూలు చేస్తున్నట్లు విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటు న్నారు. దీనిపై కట్టుదిట్టం చేయాలనే కోరుతున్నారు. పాఠశాలలో ఉచిత విద్య చట్టం అమలవుతుందా లేదా అనేది ప్రశ్నగా మారింది. దివ్యాం గులు, పేద నిరుపేదలు కొందరికి ఉచిత విద్య అందించాలనే ఆదేశాలు ఉన్నా అమలు అవుతున్నాయా లేదా పర్యవేక్షణ చేసేది ఎవరు? దానిని కనిపెట్టేది ఎవరు అనేది ప్రశ్నగా మిగిలింది. విద్యాశాఖ స్పందించి ప్రైవేటు పాఠశాలల దోపిడీని అరికట్టాలని తల్లిదండ్రులు కోరుతు న్నారు. మండల పరిధిలోని ప్రైవేటు పాఠశాలలు సుమారుగా 10 ఉన్న వాటిలో అమలవుతున్న ఉచిత విద్య, ఫీజులు, బాదుడు పుస్తకాలపై అద నపు వసూళ్లు బెల్టు, టై, షు పై అదనపు వసూలను అరికట్టాలని కోరు తున్నారు.

# రోడ్డు పక్కన వ్యర్థాలు దుర్వాసనతో ఇక్కట్లు..!



ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామీణ ప్రాంతాలలో ఉన్న రోడ్లు ఇరువైపులా కూడా చెత్తాచెదారం వ్యర్థాలు వేస్తుండటంతో దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నట్లు పలు గ్రామీణ ప్రాంత ప్రజలు తెలుపుతున్నారు. మండల పరిధిలోని చెన్నూరు ,పెద్ద కోరుకొండి, ఎర్రబోయినపల్లి, చిన్న కోరుకొండి ,పేరువంచ, బత్తుల పల్లి, ముచ్చవరం, చంద్రుపట్ల తదితర గ్రామాలలో రోడ్ల పక్కన ఇరువై పులా తోపాటు వాగులు, వంకలు వద్ద చెత్తాచెదారం, వ్యర్థాలు డంపింగ్ యార్డ్ కు చేరకుండానే మురుగు గ్రామంలో గృహాలకు సమీపంలో ఉండటంతో దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు తెలుపుతున్నారు. గ్రామాల్లో రోడ్డు ఇరువైపులా, వాగులు, వంకలు వద్ద చెత్త వ్యర్థాలు వేయకుండా అధికారులు చర్యలు తీసుకోవా లని ప్రజలు కోరుతున్నారు. రాబోయే సీజన్ కు గాను ఎలాంటి వ్యాధులు లేకుండా ముందు జాగ్రత్తగా పారిశుద్ధ్యంపాటించాలని కోరు తున్నారు. నిధులు కొరతతో ఇబ్బందులు పడుతున్నట్లు కార్యదర్శులు చర్చించుకుంటున్నారు. మరి పారిశుద్ధ్యం పాటించకపోతే వ్యాధులు రావా అని ప్రజలు ఒకరినొకరు అనుకుంటున్నారు.

## సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి



ప్రజాపక్షం/చింతకాని : పత్తి ,పెసర పంటలో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని మధిర సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్ విజయ్ చంద్ర రైతులకు సూచించారు. మంగళవారం చింతకాని మండలం లచ్చగూడెం, నేరడ గ్రామాల్లో ప్రత్తి , పెసర పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లచ్చగూడెం లో రైతు కొప్పుల గోవిందరావు సాగుచేస్తున్న అధిక సాంద్రత గల పతిపంటను పరిశీలించి పలు సూచనలు చేశారు. సాగు విధానం, ఎరువుల నిర్వహణ, నీటి యాజమాన్యం, తెగుళ్ల నియంత్రణ గురించి వివరించారు.కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి మానస, ఏఈవో రాము, రైతులు పాల్గొన్నారు.

# జూన్ 30 వరకు రేషన్ బియ్యం పంపిణీ

**-రేషన్ షాపులను తనిఖీ చేసిన డిసిఎస్‌వో**



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : జిల్లాలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మూడు నెలల రేషన్ పంపిణీ ప్రక్రియ సాఫీగా జరుగుతుందని ఈనెల 30 వరకు రేషన్ బియ్యం పంపిణీ జరుగుతుందని జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్‌కుమార్ తెలిపారు. మంగళవారం డిసిఎస్‌వో చందన్‌కుమార్ ఖమ్మం అర్బన్ మండలంలోని శ్రీనివాసనగర్, ప్రకాష్ నగర్ లలోని రేషన్ షాపులను డిప్యూటీ తహసీల్దార్ ఎం. వెంకటేశ్వర్లు తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చందన్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ నెలలో మూడు నెలల రేషన్‌ను రేషన్‌కార్డు దారులకు రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేస్తున్నామన్నారు. దీని కోసం జిల్లాకు 21.915 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం స్టాక్ వచ్చిందన్నారు. ఖమ్మంజిల్లాలో ఉన్న 4,15,904 రేషన్ కార్డులకు ఇప్పటి వరకు 3,03,596 రేషన్ కార్డు దారులకు రేషన్ షాపుల నుంచి మూడు నెలల రేషన్ బియ్యం అందిందన్నారు. రేషన్ బియ్యం సరఫరా అంశంలో అప్రమత్తంగా ఉండాలని, బియ్యం అక్రమ రవాణా జరగకుండా ఉండేందుకు అదనపు కలెక్టర్ పర్యవేక్షణలో ఆర్డీవోల ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తున్నామన్నారు. జిల్లా పౌర సరఫరాల అధికారి కార్యాలయం పరిధిలో విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ తహసీల్దార్‌లు చేపట్టిన తనిఖీల్లో భాగంగా ఖమ్మం అర్బన్, పెనుబల్లి, కల్లూరు, సత్తుపల్లి, ఏన్కూరు, తల్లాడ మండలాల్లో బియ్యం అక్రమ రవాణాదారులపై 6ఎ కేసులు నమోదు చేసి రూ.7.29 లక్షల విలువైన 213 క్వింటాళ్ల సన్న బియ్యంతో పాటు మూడు వాహనాలను సీజ్ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. రేషన్ డీలర్లు రేషన్‌కార్డు దారులకు మూడు నెలల బియ్యం సక్రమంగా అందించాలని జూన్ 30 వరకు అన్ని రేషన్ షాపులు తెరిచి ఉంచి బియ్యం పంపిణీ చేయాల న్నారు. రేషన్‌కార్డుదారులు తమ రేషన్ తీసుకుని సన్న బియ్యం పథ కాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సన్న బియ్యం బయట విక్ర యిస్తే రేషన్‌కార్డు రద్దు చేయడం జరుగుతుందని కొన్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని చందన్‌కుమార్ తెలిపారు.

# పోడు సాగుదారులకు రైతుభరోసా నిధులు ఇవ్వాలి

**సిపిఐ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ యర్రా బాబు**



ప్రజాపక్షం/కొణిజర్ల : గిరిజనులు, దళితులు పేద వర్గాలు అనేక సంవత్సరాలుగా భూమి లేని నిరుపేదలు అటవీ బంజరు భూములను సాగుచేసుకొని జీవనం సాగిస్తున్నారని పోడు భూములకు వ్యవసాయ పెట్టుబడులకు రైతుభరోసా నిధులు ఇవ్వాలని సిపిఐ వైరా నియోజవర్గ ఇన్‌చార్జ్ యర్రా బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిదిలోని సిఆర్‌నగర్, బస్వాపురం గ్రామశాఖల మహాసభల్లో పాల్గొని ప్రసంగించారు. ఐదు దశాబ్దాలనుంచి తుమ్మలపల్లి, సిఆర్‌నగర్ నుంచి ఉప్పలచలక వరకు అటవీభూమని సాగుచేసుకొని భూమి లేని దళిత, గిరిజన, బడుగు, బలహీనవర్గాలు వ్యవసాయంచేస్తు జీవిస్తు న్నారని తెలిపారు. వారికి ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించాలని పేర్కొన్నారు. విత్తనాలు, ఎరువులు కొనుక్కోవాలన్నా పండించిన పంటను విక్రయించుకోవాలన్నా పట్టాలు లేక తీవ్ర ఇబ్బందులు పడు తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భూభారతి చట్టం ద్వారా పట్టా హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభల్లో సిపిఐ మండల నాయకులు కట్ల సత్యం, గడల శ్రీనివాసరావు, బొడ్డుపల్లి కోటేశ్వరరావు, వింజం గోపాలకృష్ణయ్య, పెనుగొండ వెంకటేశ్వర్లు, సూర్య, భూక్యా సీతారాములు తదితరులు పాల్గొన్నారు. అనంతరం సిఆర్‌నగర్ గ్రామశాఖ కార్యదర్శిగా తేజావత్ శ్రీను, బస్వాపురం గ్రామశాఖ కార్య దర్శిగా పెనుగొండ వెంకటేశ్వర్లును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# యుద్ధాలతో అభివృద్ధి సాధించలేం




**-వర్గ పోరాటాలతోనే సమాజ మార్పు**
**-రాజకీయ శిక్షణా తరగతుల్లో పోతినేని**

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : యుద్ధాల ద్వారా అభివృద్ధి సాధించలే మని అభివృద్ధి సాధించాలంటే అన్ని దేశాల మధ్య సకృత ఉండాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, జిల్లా కార్య దర్శి నున్నా నాగేశ్వరరావు లు తెలిపారు. మంగళవారం సిపిఎం పాలేరు నియోజక వర్గ స్థాయి రాజకీయ శిక్షణా తరగతులు ఖమ్మం సుందరయ్య భవన్‌లో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సిపిఎం జెండాను సీనియర్ నాయకులు మద్ది వెంకటరెడ్డి ఆవిష్కరించారు. రాజ కీయ శిక్షణా తరగతులకు రాష్ట్ర కమిటీ సభ్యురాలు బుగ్గవీటి సరళ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న యుద్ధాలకు కారణం అమెరికా సామ్రాజ్యవాదమని వారు తెలిపారు. అభివృద్ధి సాధించాలంటే అన్ని దేశాల మధ్య సకృత ఉండాలన్నారు. అమెరికా అణు ఆయుధాలను అమ్ముకునేందుకు యుద్ధాలను సృష్టిస్తుందన్నారు. అగ్ర రాజ్యంగా ఉన్న అమెరికా అప్పుల్లో కూరుకుపోయిందన్నారు. మరో 20 ఏళ్లలో కమ్యూనిస్టు దేశమైన చైనా అగ్రగామిగా ఉంటుందన్నారు. వర్గ పోరా టాల ద్వారానే సమాజం మారుతుందని అందుకే కమ్యూనిస్టులు వర్గ పోరాటాలు నేర్చుకోవాలన్నారు. మార్క్స్ చెప్పినట్లు గత చరిత్రంతా వర్గ పోరాట చరిత్రే అన్నారు. మతాన్ని అడ్డుపెట్టుకుని ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు పాలకులు కృషి చేస్తున్నారన్నారు. ప్రజల పక్షాన పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ శిక్షణ తరగ తుల్లో జిల్లా కమిటీ సభ్యులు షేక్ బషీరుద్దీన్, నంద్ర ప్రసాద్, సుదర్శన్ రెడ్డి, నాగేశ్వరరావు, కొమ్ము శ్రీను, మల్లెల హన్మంతరావు, తోటకూరి రాజు, నాగేశ్వరరావు, సుగుణమ్మ, సుమతి, కృష్ణ, మోహన్‌రావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## పండుగకు రావాలని ఎస్ఐకు ఆహ్వానం



ప్రజాపక్షం/ఆళ్లపల్లి: జూన్ 29న స్థానిక రోమన్ కతోలిక మిషన్ పునీతులు పౌలు, పేతురు చర్చి పండుగకు రావాలని, ప్రత్యేక ఆహ్వానంతో ఎస్ఐ సోమేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా మంగళవారం పోలీస్ స్టేషన్‌లో కలిసి ఆహ్వానం పలికి, పట్టుశాలువాతో సన్మానం చేశారు. స్థానిక ఆర్సియం విచారణ తిరు హృదయ సభ గురువు రెవరెండ్ ఫాదర్ జేసు ప్రసాద్, ఉమ్మడి ఖమ్మం జిల్లా జ్యోతిర్మయి యానిమేటర్, ప్రముఖ సీనియర్ పాత్రికేయులు పరమ ప్రభాకర్ తెలిపారు. పునీతుల పండుగ పవిత్రమైన సాంప్యాలతో నిర్వహిస్తున్నామని, ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా ఉమ్మడి ఖమ్మం ఆర్సియం పీఠాధిపతులు మోస్ట రైట్స్ రెవరెండ్ బిషప్ డాక్టర్ సగిలి ప్రకాష్ తండ్రి హాజరుకానున్నారని, ఈ వేడుకకు పలువురు గురువులు సైతం హాజరుకానున్న నేపథ్యంలో స్థానికంగా ఎస్ఐ సోమేశ్వర్‌ను తప్పకుండా రావాలని ప్రత్యేకంగా ఆహ్వానం పలకడం జరిగిందని ఈసందర్భంగా ఫాదర్ జేసు ప్రసాద్ తెలిపారు.

## అంగన్‌వాడీలో అక్షరాభ్యాసం



ప్రజాపక్షం/బూర్గంపాడు: బూర్గంపాడు ప్రాజెక్ట్ పరిధి లోని మోరంపల్లిబంజర్ సెక్టర్‌లో గల లక్ష్మీపురం వన్, టూ, త్రీ అంగన్‌వాడీ కేంద్రాలలో అమ్మ మాట..అంగన్ వాడీ బాట కార్యక్రమం నిర్వ హించారు. మంగళవారం అంగన్‌వాడీ కేంద్రాలలో అక్షరాభ్యాసం సిడిపివో రేవతి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడేండ్లు నిండిన పిల్లలం దర్ని అంగన్‌వాడీ కేంద్రంలో నమోదు చేయించాలని తల్లిదండ్రులకు తెలిపారు. తల్లులకు సీజన్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. కిశోర్ బాలికలకు మిలెట్ చిక్కిల గురించి వివరించారు. 14నుండి18 సంవత్సరాల కిశోర్ బాలికలకు మాత్రమే ఇందిరమ్మ అమృత నేస్తం ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం హరితహారంలో భాగంగా మొక్కలు నాటా రు. పిల్లలకు ఎగ్ బిర్యాని వంటకం చేశారు. ఈకార్యక్రమంలో సూపర్వైజర్ స్వరాజ్యం, ఏఎన్ఎంలు రోశమ్మ, జయసుధ, ఆశాలు రమణ, లక్ష్మీ, అంగన్‌వాడీ టీచర్లు బి భూలక్ష్మీ, బి దేవకరుణ, పి వెంకమ్మ, అంగన్‌వాడీ ఆయాలు పి అక్కమ్మ, బి ఉష, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ బోర్డు కార్యాలయం ముట్టడి




ప్రజాపక్షం/సత్తుపల్లి: భవన నిర్మాణ కార్మి కుల సమస్యల పరి ష్కారం కోరుతూ భవన నిర్మాణ కార్మికులు హైద్రాబాద్‌లోని భవన నిర్మాణ కార్మికులు సంక్షేమ బోర్డు కార్యాల యాన్ని మంగళవారం ముట్టడించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియూసి ఖమ్మం జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మీనారాయణ, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నిమ్మటూరి రామకృష్ణ, బిల్డింగ్ వర్కర్ యూనియన్ జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్ రహ్మతుల్లా, హౌస్ పెయింటింగ్ వర్కర్స్ యూని యన్ నాయకులు పూరేటి జయరాజు, మిరియాల అనిల్ , కనకరాజు, తరుణ్, సురేంద్ర, రవి, నాగేశ్వరరావు, వెంకన్న, పుల్లయ్య, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, వల్లూరి శీను తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్ బ్యాగ్‌లు పంపిణీ




ప్రజాపక్షం/సత్తుపల్లి: కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు ఉం టుందని, చదువు ఒక్కటే కాకుండా క్రీడ ల్లోనూ విద్యార్థులు రాణించాలని సుధా హెర్బల్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్, సనాతన ఆయుర్వేద వైద్యురాలు డాక్టర్ కొనకళ్ల సుధా రాణి అన్నారు. మండల పరిధిలోని కొమ్ముగూడెం మండల పరిషత్ పాఠశాలలో 41 మంది విద్యార్థులకు మంగళ వారం స్కూల్ బ్యాగ్‌లు పంపిణీ చేశారు సుదా కొనకళ్ళ. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ బడి ఈడు పిల్లలందరినీ తల్లిదండ్రులు పాఠశాలకు పంపించాలన్నారు. విద్యతోనే వికాసం కలుగుతుందని, ఈ విషయాన్ని పిల్లల తల్లిదండ్రులు గుర్తెరగాలన్నారు. అనం తరం ఆమె పిల్లలకు చిన్న, చిన్న ఆరోగ్య సలహాలు చెబుతూ చదువు విలువ గురించి, పర్యావరణ పరిరక్షణకై మొక్కలు వేయాలని చెప్పి పాఠశాల ఆవరణలో పిల్లలతో కలిసి మొక్క నాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ మధు, యం. ఇ.ఓ ఎన్ రాజేశ్వరరావు పాల్గొన్నారు.

## అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట



ప్రజాపక్షం/సత్తుపల్లి: మండల పరిధిలోని గంగారం గ్రామంలో గల అంగన్ వాడి సెంటర్లలో అమ్మ మాట, అంగన్ వాడీ బాట కార్యక్రమంలో బాగంగా సిడిపిఓ ఎస్.కె మెహరున్నీసా బేగం ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంగన్ వాడీ సెంటర్ లో పది మంది చిన్నారులకు అక్షరాభ్యాసాలు నిర్వహించి, తల్లులకు పోషకాహారం గురించి వివరించి, మూడు సంవత్సరాలు నిండిన పిల్లలకు ప్రీస్కూల్ ఆవశ్యకత గురించి తల్లులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి స్కూల్ హెచ్ఎం సాంబశివరావు, స్కూల్ టీచర్ ప్రమీల, సెక్టార్ సూపర్ వైజర్ గంగాజలం, అంగన్ వాడీ టీచర్లు సకినా బేగం, కృష్ణకుమారి, సౌభాగ్యవతి, గంగాభవాని, ప్రాజెక్టు కోఆర్డినేటర్ ప్రసాద్ తదితరులు హాజరైనారు.

# రూ.193.44 కోట్లు రైతుల ఖాతాల్లో జమ

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రైతు భరోసా వానా కాలంకు సంబంధించి రూ.193,44,97,643 లను రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందని జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య మంగళవారం తెలిపారు. ప్రభుత్వం వానా కాలానికి సంబంధించి రైతు భరోసా నిధులను విడుదల చేసిందని సోమవారం నుంచి రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఖమ్మం జిల్లాలో రైతు భరోసాకు సంబంధించి 3,53,794 మంది రైతులకు గాను మొత్తం రూ. 436,84,65,365 జమ చేయాల్సి ఉందన్నారు. మొదటి రోజు అనగా ఈనెల 16న ఎకరం, రెండు ఎకరాల లోపు ఉన్న 2,13,932 మంది రైతులకు రూ. 123,38.40,175 జమ చేయడం జరిగిందన్నారు. ఈనెల 17న మంగళవారం మూడు ఎకరాల వరకు భూమి గల 46,859 మంది రైతులకు రూ.70,06,57,468 లను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు ఆయన తెలిపారు. ఇప్పటి వరకు 2,60,791 మంది రైతులకు రూ. 193,44,97,643 రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు.



2025 జూన్ ఐదు నాటికి పట్టాదారు పాసు పుస్తకం పొందిన రైతులు డిబిటి ఫెయిల్ అయిన రైతు సోదరులు సంబంధిత ఏఈవోలను సంప్రదించి రైతు భరోసా కోసం ఖాతా నెంబర్‌ను నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు.

# జిల్లా కలెక్టర్‌గా తనదైన ప్రత్యేకతను చాటారు

## -కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను కలిసిన దయాకర్ రెడ్డి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జిల్లా కలెక్టర్‌గా సుమారు ఏడాది కాలం పాటు విధులు నిర్వహించిన ముజమ్మిల్ ఖాన్ పాలనలో తనదైన ప్రత్యేకతను చాటుకున్నారని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇంచార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి తెలిపారు. బదిలీపై వెళ్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను ఖమ్మంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో దయాకర్‌రెడ్డి మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువతో సన్మానించి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి బదిలీ అయ్యే వరకు నిబద్ధతతో పని చేశారన్నారు. భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

# అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట

**ప్రజాపక్షం/కూసుమంచి :** ఐసిడిఎస్ ఆధ్వర్యంలో తిరుమలాయపాలెం ప్రాజెక్టు ఆధ్వర్యంలో కూసుమంచి మండల స్థాయిలో జీళ్ళ చెరువు గ్రామంలో ఉన్న రైతు వేదిక నందు మంగళవారం నాడు అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిస్టిక్ వెల్ఫేర్ ఆఫీసర్ రామ్ గోపాల్ రెడ్డి, హాజరయి అంగన్వాడీ స్కూల్స్ పిల్లల అభివృద్ధి క్షేత్రాలుగా తీర్చిదిద్దబడుతున్నాయని కావున పిల్లలందరినీ కూడా అంగన్వాడికి పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. ప్రీ స్కూల్ కార్నర్స్, ప్రీస్కూల్ మెటీరియల్ ఎగ్జిబిషన్, పిల్లల విచిత్ర వేషధారణలు, ఫాన్సీ డ్రెస్సెస్, 25 మంది పిల్లలకు అక్షరాభ్యాసములు ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలకు, గ్రాడ్యుయేషన్ డే, ఈ కార్యక్రమాలన్నీ కూడా డి డబ్ల్యు ఓ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. అనంతరం పిల్లలందరికీ కూడా ఈ సంవత్సరము నూతనంగా ప్రవేశ పెట్టబోతున్న మెనూ లో భాగంగా ఎగ్ బిర్యానీ చేసి పిల్లలకు వడ్డించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిడిపిఓ కవిత హాజరైన తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ,




పిల్లల యొక్క మేధో వికాసం గురించి, అంగన్వాడీలో కార్యక్రమాలు నిర్వహించడం వల్ల పిల్లలలో కలిగే అభివృద్ధిల గురించి వివరించినారు. ఈ కార్యక్రమానికి గ్రామ పెద్ద పెండ్ర అంజయ్య , అంగన్వాడి సూపర్వైజర్స్, అంగన్వాడి టీచర్స్ హెల్పర్స్, ఆశా వర్కర్స్, గ్రామంలో ఉన్న తల్లులు, మండలంలోని తల్లులు ఇతర పెద్దలు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన కూసుమంచి సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం చోటు చేసుకుంది. రఘునాథపాలెం మండలం వి. వెంకటాయపాలెం గ్రామానికి చెందిన బానోత్ మణిచంద్ర (22) మృతి చెందగా తండ్రి బాలాజీకి కాళ్లకు, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. తండ్రి బాలాజీతో కలిసి మణిచంద్ర మోతె మండలం బురక చర్లలో ఓ వేడుకకు హాజరై తిరిగి వస్తుండగా కూసుమంచి సమీపంలో జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఎదురుగా వెళ్తున్న డిసిఎం వాహనం ఒక్కసారిగా ఆగి పోవడంతో దానిని వెనక నుంచి ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో మణిచంద్ర అక్కడికక్కడే మృతి చెందగా తండ్రి బాలాజీకి కాళ్లకు, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. బాలాజీని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మణిచంద్ర తల్లి రంగాబాయి అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేస్తూ కొద్ది నెలల క్రితమే గుండెపోటుతో మృతి చెందింది. నెలల వ్యవధిలోనే తల్లి, కొడుకు మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మణిచంద్ర డిగ్రీ పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగానికి సిద్ధమవుతున్నాడు.

# జీళ్ళ చెరువులో ప్రభుత్వ భూమి కబ్జా





**ప్రజాపక్షం/కూసుమంచి:** మండల పరిధిలోని జీళ్ళ చెరువు రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 616 లో గల 30 కుంటల ప్రభుత్వ భూమిని గ్రామానికి చెందిన కొందరు కబ్జా చేశారని దాని వెంటనే అధికారులు స్వాధీనం చేసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. గతంలో ఇదే భూమిపై గ్రామస్తులు ఫిర్యాదు చేయగా అప్పట్లో కబ్జాలు చేసిన వారిని తొలగించిన అధికారులు చూసి చూడనట్టుగా వ్యవహరించడంతో తిరిగి కబ్జాదారులు ఆ భూమిపై కన్నేసి కబ్జా చేస్తున్నారన్నారు. గతంలో పోలీస్ స్టేషన్లో ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కుంట భూమి 5నుండి 6 లక్షల రూపాయల ధర పలుకుతుంది. ప్రస్తుతం ఆ భూమి విషయంలో గతంలో ఫిర్యాదు చేసిన వారు ఆక్రమించిన వారు ఒక అవగాహనకు వచ్చి తిరిగి ఆ భూమిని తమ సొంతం చేసుకోవాలని ఆరాటపడుతున్నారన్నారు. అందులో భాగంగానే గ్రామానికి చెందిన ఒక 10 నుండి 15 మంది కుమ్మక్కై ఆ భూమిని ఎలాగైనా తమ సొంతం చేసుకోవాలని కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని కబ్జాదారులపై తగు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# మహిళా సంఘాలు పారిశ్రామిక వేత్తలుగా మారాలి

**ప్రజాపక్షం/భద్రాచలం :** స్వయం సహాయక మహిళా సంఘాలు పారిశ్రామికి వేత్తలుగా మారాలని, ఇందుకు ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహాన్ని అందిస్తుందని, సెర్ఫ్ డిపిఎం నాగజ్యోతి, రమాకాంత అన్నారు. ఈ సందర్భంగా రైతువేదిక వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడుతూ, పేదరిక నిర్మూలనే




లక్ష్యంగా గ్రామీణ ప్రాంతాల స్వయం సహాయక సంఘాల మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్ప్రెనియర్ ఆఫ్ ఇండియా ప్రపంచ బ్యాంకు నిధుల సహకారంతో భారత ప్రభుత్వం రైసింగ్ అండ్ యాక్సిలెరేటింగ్ ఎంఎస్ఎంఇ పెర్ఫార్మెన్స్‌లో భాగంగా తెలంగాణ ప్రభుత్వం పరిశ్రమలశాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ , గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఒక్క రోజు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్సాహవంతులైన మహిళా సంఘాల వారికి పదిహేను రోజుల పాటు శిక్షణను అందించి బ్యాంకుల ద్వారా రుణసదుపాయాన్ని కల్పించనున్నట్లు చెప్పారు. భద్రాచలం, బూర్గంపాడు, దుమ్ముగూడెం, చర్ల , పినపాక, కరకగూడెం, మణుగూరు, అశ్వాపురం, అశ్వారావుపేట 9 మండలాలకు చెందిన స్వయంసహాయ సంఘాలు హాజరైన ఈ కార్యక్రమంలో ఏపిఎంలు జూపల్లి జగదీష్, సిసిలు, పులుసు సీతారామయ్య, పాగా రాంబాబు, ఎంఎంఎస్ సభ్యులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త వ్యక్తులు కన్పిస్తే పోలీసులకు సమాచారమివ్వాలి

**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు ఓఎస్డి నరేందర్ సూచనలతో టేకులపల్లి సిఐ టి సురేష్ ఆధ్వర్యంలో ఆళ్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని సింగారం, పెద్ద వెంకటాపురం గుత్తికోయ గ్రామాలలో కమ్యూనిటీ కనెక్ట్ ప్రొగ్రామ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలతో మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకుని, ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వారికి భరోసా కల్పించారు. అలాగే తెలియని వ్యక్తులు తమ తమ గ్రామాలలోకి ప్రవేశిస్తే వారికి ఆశ్రయం కల్పించొదని సిఐ సురేష్ సింగారం, వెంకటాపురం గుత్తికోయ గ్రామస్తులకు తెలిపారు. ఇటీవల వరుస ఎదురు కాల్పులు, అరెస్టుల వలన అసాంఘీక శక్తులు తమ రక్షణ కోసం చత్తీష్ఘడ్ ప్రాంతానికి దగ్గరగా ఉన్న తెలంగాణలోని సరిహద్దు గ్రామాల్లోకి ప్రవేశించే అవకాశం ఉన్నందున గుర్తు తెలియని వ్యక్తులు, మావోయిస్టు సానుభూతిపరులు మీ గ్రామానికి మీ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు కనిపిస్తే స్థానిక పోలీసులకు లేదా 100కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని, ఈ సమాచారం తెలిపిన వారి వివరాలు



గోప్యంగా ఉంచి వారికి తగిన నగదు పారితోషకంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అసాంఘిక వ్యక్తులకు ఆశ్రయం కల్పించకూడదని, వారికి దూరంగా ఉండాలని తెలిపారు. యువత మంచిగా చదువుకొని ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలలో ఉద్యోగాలు సంపాదించాలని, క్రీడల్లో రాణించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఆళ్లపల్లి ఎస్ఐ ఎం సోమేశ్వర్, టీజీఎస్పీ సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

# మైనార్టీ గురుకుల డిగ్రీ కాలేజీని ఏర్పాటు చేయాలి



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** రాష్ట్రంలో మైనారిటి గురుకుల డిగ్రీ కళశాలనను ఏర్పాటు చేయాలని కోరుతూ జిల్లా మైనార్టీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎండి యాకూబ్ పాషా మైనార్టీ గురుకులాల కార్యద్శి బి షఫీవుల్లాను హైదరాబాద్‌లో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 204 మైనార్టీ గురుకుల జూనియర్ కాలేజీలు ఉన్నాయని, ప్రతీ ఏటా పది వేల మంది ఇంటర్ పూర్తి చేస్తున్నారని, మైనార్టీ డిగ్రీ కాలేజీలు లేకపోవడంతో చాలా మంది అక్కడితో చదువులు ఆపేస్తున్నట్లు తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి లకు రాష్ట్ర వ్యాప్తంగా 79 డిగ్రీ కాలేజీలు ఉన్నాయని, మైనార్టీలకు ఒక్కటి కూడా లేదన్నారు. దీంతో మైనార్టీలు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని, దీనిని దృష్టిలో పెట్టుకుని బాలబాలికలకు వేర్వేరుగా మైనార్టీ గురుకుల డిగ్రీ కాలేజీలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా కార్యదర్శి స్పందిస్తూ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు హామీ ఇచ్చినట్లు యాకూబ్ పాషా తెలిపారు.